# శిలాద్రవం

శ్రీ యన్. ఆర్. నంది

ఆలయంలో పూజారి మొదలుకొని, నీలాటిరేవుదగ్గర అమ్మలక్కల వరకూ గంగమ్మ గయ్యాళి దనే మంచి పేరుని సంపాదించుకొంది. ఎక్కడ, ఎలాంటి జగడాలొచ్చినా గంగమ్మ తయారుగా వుంటుంది. అస లామెనోరు లేని దెబ్బలాటే వుండదు.

గ్రామంలో ఆడవాళ్లందరికీ గంగమ్మంటే భయం. ఆమె స్నేహానికి ఎంతో మంది పాటుపడుతుంటారు - భక్తివల్లకాదు; ఎప్పుడెలాంటి విపత్తులొచ్చిపడతాయో, గంగమ్మ ఎదుటివారికి సాయం చెడుతుందేమోనని అందరూ ఆమె స్నేహాన్ని కోరేవారే. వొండిన కూరలదగ్గరనించి, కట్టుకోబోయే చీరవరకూ ఆమెకి చూపించకండా ఏ పనీ, ఏ కార్యమూ గ్రామవనితలు చేయరు. అవన్నీ ఆమె దయ తమ మీదికి ప్రసరించాలనే.

నోరు విప్పిందా తుఫానే. వీధుల్లో నడచిందా గాలివానే. ఒప్పని దయ్యానికి తప్పక తిరగాలని, కొందరు బుద్ధిమంతులు ఆమెకి అగుపించకండా తిరిగారా ఇక వాళ్ల మీద రకరకాల సూటీమాటలు విసురుతుంది. చివరికి మగాళ్లుకూడ ఆమె అంటే భయంగా తిరుగుతుంటుంటారు. కాని మగాళ్ల జోలికి గంగమ్మ అంతగా పోదు. జగడం పెరిగిందా, మరి మగాళ్ళే కాదు, ఆడాళ్లే కాదు ఆమె పిడికిలిగుద్దులు తినవలసిందే!

అందులో ఆమెకు ఒక భర్త, ఒక ఐదేళ్ల కొడుకు. తప్ప వేరే చీదరా బాదరాలేని సంసారం. భర్త వెంకన్న పొలాల్లో కష్టపడుతుంటుంటే, గంగ పని వూరుమీద తిరగడం, జగడానికేమాత్రం సందు దొరికినా వొదలకండా, దాన్ని పెంచీ, పెద్దజేసీ, చివరికి జుత్తులు జుత్తులు పట్టుకొనేవరకూ రాజేసి, ఆఖరున యిద్దరు యిల్లాళ్ల జుత్తులూ కలిపిలాగి, ఇద్దర్నీ సరిచేసేది. గంగ చేతిలో ఉత్తిపుణ్యానికి తన్నులు తిన్న యిల్లాళ్లిద్దరూ, కోపంగా ఒకర్నొకరు చూసుకొని, గంగకేసి కొరుక్కు తినేయాలన్నంత కసిగా చూసేవారు; కాని గంగ ఓ మహామ్మారి. దాన్ని కదిపితే యింకేమయినా వుందా!

గంగవయసు అంత పెద్దదికాదు; నడివయసుంటుంది. ఆమెకి పుట్టిన ఐదుగురు పిల్లలు కొంతకాలం బతికి, అందరూ ఒకలాగే స్ఫోటకంతో చచ్చిపోయేవారు. 'మాంచి పని దొంగముండకి, లేకపోతే యింతమంది నిలా యేడిపిస్తోంటే, ఆయమ్మకిమాత్రం కడుపు తరుక్కుపోదూ?' అని అమ్మలక్కలు చాటు చాటున తిట్టుకొనేవారు.

ఒకసారి వెంకన్న భార్యతో యిలానే అంటె, 'ఆ అమ్మవారి సంగతి కనుక్కొంటాను. దానికి నేమ గయ్యాళిదాన్నట. అదే వూరందర్నీ మింగేస్తూ పైగా నన్ను గయ్యాళినని నా పిల్లల్ని పీకలు నొక్కేస్తోంది' అని ఆవేశంతో గంగమ్మ ఊరిచివరి ఆలయంలోకి పరుగెత్తుకెళ్లి చీపురుతో అమ్మవారి ముఖాన్ని దబదబా బాదింది. వెంటనే మూడో పిల్లాడు చనిపోయాడు.

తర్వాత పుట్టిన యిద్దరు పిల్లలుగూడ అలానే రక్తాన్ని కక్కుకొంటూ ఐదేళ్లు దాటేలోగా చచ్చిపోగానే, గంగమ్మ గజగజ వొణికిపోయి, అమ్మవారి కాళ్లు పట్టుకొని క్షమించమని ఆ ఆలయంలో రెండు రోజులు నిద్రాహారాలు మాని అలానే వుండిపోయింది. చివరికి దేవి కటాక్షించి, ఈ కొడుకు మిగిలాడు. వాడికి ముద్దుగా పిచ్చయ్య అని పేరుపెట్టుకుంది.

ఆ మిగిలిన ఒక్క నలుసంటే గంగమ్మకి ప్రాణం. ఊళ్లో గయ్యాళిదైనా భర్తని కీలుబొమ్మలా తన చేతిలో ఆడించినా, ఆ చిన్నాడిదగ్గరమాత్రం పిల్లి - ఏమో వాడు దక్కుతాడో దక్కడో అని. అయినా వీలయినప్పుడల్లా వీధుల్లోకెళ్లి దేని జుత్తో ఓదాని జుత్తు పట్టుకొని లాగకండా, ఉత్తిపుణ్యానికి తిట్టేవరకూ చెయ్యి నోరు వుంచబట్టేవికాదు.

తన పిల్లడంటే గంగకి ప్రేమేగాని, మిగతా పిల్లలంటే ఆమెకి అసహ్యం; అందులో పక్కింటి రావన్న కొడుకంటే మరీను. కారణం రావన్న కొడుకుతో కూడితే తన పిచ్చి పోకిరీ అయిపోతాడట, అందువల్ల. ఒక్క రావన్న కొడుకే కాదు మిగతా కుర్రగుంట లెవరితోనూ కొడుకుని కలియనిచ్చేదికాదు.

కొంతమం దప్పాటే 'గంజాయివనంలో తులసిమొక్క పుడుతుందా. గయ్యాళిదాని కొడుకు గజదొంగవుతా'డని కళ్లల్లో కారాలు పోసుకొంటున్నారు. వాళ్లకి బుద్ధొచ్చేటట్టు తన కొడుకుని బృహస్పతిని చేసేయా లనుకొనేది.

గంగ పూర్తిగా పల్లెవాసి. ఆమె ఎంత అజ్ఞానో అంత మూర్ఖురాలు. తనకి తోచదు యితరులు చెబితే వినదు. ఎంత మూర్ఖురాలో అంత సాహసిగూడ. ఆ మూర్ఖ సాహసంతో అగ్గిలోనన్నా దూకుతుంది గాని, అగ్గిలో పడితే తన వొళ్లే కాలుతుందని గ్రహించని మంకుపట్టు.

బడికి పంపితే కొడుకు చెడిపోతాడేమోనని, ఒక యింగ్లీషు తెలీని పంతుల్ని యింటిదగ్గరే వుంచి కొడుక్కి చదువు చెప్పించుకొంటోంది.

ఆ పంతు లోసారి కొడుకుని 'ఒరే' అన్నాడట. గంగమ్మ ఉగ్రురాలై పిల్లాడు ఎదురుగానే గురువుగారిని నానా మాటలు ఆడింది. కొంతకాలం తర్వాత ఆ పంతులు మరిచిపోయి, పిల్లాడిని కొట్టాడు - వాడేదో తప్పు చెబితే. వెంటనే గురువుగారి పని వూడిపోయింది. రెండో గురువుగారు తయారు!

ఒకరోజు సాయంకాలం గంగమ్మ నూతిదగ్గరకు వెళ్లింది. అక్కడొక యిల్లాలేవో కష్టసుఖాలు చెప్పుకొంటుంటే ఆ మాటలని వింటూ గంగమ్మ ఆ నూతిదగ్గరే యిల్లుని మరచి చదిగిలబడింది.

తల్లి లేదు, సందు దొరికిందని, ఇంట్లో పిచ్చయ్య పక్కింటి రావన్న కొడుకుని పిలచాడు. పిచ్చయ్య చెట్టెక్కి నాలుగు జాంకాయలు కోసి రెండు స్నేహితుడికిచ్చి, రెండు తను తింటున్నాడు ఆ చెట్టుకిందే కబుర్లు చెప్పుకొంటూ. అంతలోనే గంగమ్మ వొచ్చింది. ఆమెని చూడగానే యిద్దరు పిల్లలు కొయ్యబారిపోయారు.

కొడుకు గాబట్టి పిచ్చయ్యకి తల్లిదగ్గర కాస్త చనువు ధైర్యం వుంది. మెల్లగా లేచి తల్లిదగ్గరికి వొచ్చి, తల మెల్లగా తిప్పుతూ

'రాము, అమ్మ, వాడు' అన్నాడు వాడిని తల్లికి పరిచయం చేస్తున్నట్టు.

ఆమెకి కళ్లు లేవూ చూడ్డానికి? తనింట్లోకి వొచ్చి, తన జాంకాయలు తినేందుకు వాడికెన్ని గుండెలుండాలి? వాడి ప్రోత్సాహంవల్లే తన కొడుకు కాయలు కోసివుంటాడని మండిపోయింది. చింద గభుక్కున అక్కడ దింపి, చెట్టుకింద దిక్కు చచ్చిన రాముదగ్గరికి గబగబా వెళ్లి, చెవి మెలికలు పెట్టి వాణ్ణి అమాంతంగా నిలబెట్టింది. రాము ఏడుపుముఖం పెట్టేశాడు. పోనీ గట్టిగా ఏడవడానికైనా జాంముక్క గొంతు కడ్డంగా పడింది.

స్నేహితుని అవస్తని, తల్లి క్రూరత్వాన్ని పిచ్చయ్య సహించలేకపోయాడు. రాముచెవి తల్లి పట్టుకొని నులిమేస్తోంటె, పిచ్చయ్యకి కళ్లనించి నీరు తిరిగిపోయింది. తల్లి దగ్గరకి పరుగెత్తి, తల్లి రెండుచేతులూ విడిపించబోయాడు.

'అమ్మమ్మా రాము తెంపలేదమ్మా. నేనే తెంపి రాము కిచ్చానమ్మా. రాముని నేనే పిలచానమ్మా' అని కేకలేస్తూ ఆమె చేతుల్ని, బలమంతాన వుపయోగించి విడదీయబోయాడు.

'ఏయ్, పిచ్చి, నువ్వూరుకో. ఈ వెధవ పని చెబుతాను. ఆ కాయలు నువ్వు కోయ్యలేదు. వీడే కోశాడు. నేను చూశాను' అని రాము బుగ్గల్ని నులుముతోంది.

రాముపాలబుగ్గలు ఎర్రగా కంది పోయాయి. గడగడ లాడిపోతున్నాడు. స్నేహితుని బాధని పిచ్చయ్య చూడలేక పోయాడు. ఇద్దరు స్నేహితులూ చేతగాని చూపులు చూసుకొంటూ కన్నీరు కార్చుకొంటున్నారు.

'అమ్మ, అమ్మ, రాము తెంపలేదు నేనే తెంపి రాముకి యిచ్చానమ్మ ఒట్టు నీతోడు అమ్మ...మ్మ...' అని పిచ్చయ్య గూడ ఏడ్చేశాడు.

రాము గొంతుకలోని జాంముక్క పడిపోయింది. గొంతుకలో బలంగా నొక్కబడివున్న ఏడుపంతా ఒక్కసారిగా ఘొల్లుమంది. గంగమ్మ యిష్టమొచ్చినట్టు, కొడుకు చేతుల్లో పడుతున్నా సరే విదిలించుకొంటూ రాముని దబదబా బాదేస్తోంది, చచ్చేదిగూడ కానకండా.

కొడుకు ఏడుపు వినిపించిందో ఏమో, రాముతల్లి అవలి దొడ్డి పిట్టగోడమీదనించి తొంగిచూసింది. గోడమీద తల్లిముఖం కనిపించగానే, రాము లక్షుమంది ఆప్తుల్ని చూసినట్టు 'అమ్మ' అని పెద్దకేక వేశాడు.

కొడుకు గయ్యాళిగంగమ్మ చేతుల్లో గిలగిలా కొట్టుకొంటూంటె, పరాయివాని చేతుల్లో చావుదెబ్బలు తింటుంటె, ఆ మాతృహృదయం సహించలేకపోయింది. సాతాళతో తనకేసి చూస్తున్న కొడుకు చూపుల కలవరాన్ని చూసి ఆ తల్లి మనసు భరించలేకపోయింది. పదడుగుల గోడ మీంచి భంగున దూకి, రక్కసి చేతుల్లో చిత్రవధ గావింపబడుతున్న కొడుకుని గభుక్కున లాక్కొని గట్టిగా కౌగిలించుకొంది. అగ్గిలో కాలిపోతున్న శరీరంమీద ఒక్కసారిగా నవనీతం వర్షించి, మలయ మారుతాలు వీచినట్టుంది రాముకి ఆ తల్లి ఆలింగన. ఒక్కసారిగా ఘొరుమన్నాడు.

స్నేహితుడు రక్షింపబడ్డాడని పిచ్చయ్య ఎగిరి గంతేశాడు. తన కొడుకంటె తనకి ముద్దుగాని, యితర పిల్లలంటె తనలాగే మరో తల్లికిగూడ ముద్దనే సంగతి గంగమ్మకు తెలీదు-తెలుసు-కాని ఆ పిల్లాడు తన గర్భంలో పెరగలేదుకదు.

'నీ చేతులు మండ, నీ చేతులు ముక్కలవ, ఎందుకే నా కొడుకు నలా చచ్చినట్టు బాదుకొంటున్నావ్? ఆ చిన్నాడు నిన్నేం చేశాడే?' అనేసింది రాముతల్లి, కొడుకుఏడుపుని చూడలేక, ఉడికి



పోతున్న దుఃఖంతో, ఎదురుగుండా వున్నది పిశాచి అని తెలిసిగూడ.

ఇక గంగమ్మ అంత మాట సయించ గలదా? విరుచుకపడిపోయింది. ఆమెను నానాతిట్లు తిట్టుకొంటూ మీద కలబడి. ఆమె జుత్తు అందుకొని, బరబర లాగేసింది గంగమ్మ. ఆమె ఒడిలోవున్న రాము కింద పడిపోయాడు.

సరయినపట్టు దొరికిందిగాబట్టి గంగమ్మ, ఆమెను నేలమీద పడేసి యిష్టమొచ్చినట్టు డొక్కలోను పక్కలోను-ఎక్కడబడితే అక్కడ కాలుతో శక్తికొద్దీ తంతోంది. తల్లి బాధని, ఏడ్పునిచూడలేక రాము గొల్లు మన్నాడు. ఇక సయించలేక పక్కనున్న ముల్లకర్ర తెచ్చి గంగమ్మని బాదుతున్నాడు.

పిచ్చయ్యకి ఏడుపొచ్చేస్తుందిగాని, మధ్య దూరలేకపోతున్నాడు. ఇప్పుడు తల్లిని రాము ముల్లకర్రతో కొడుతుండడం చూసి, వాడి చేతిలోని కర్రని గభుక్కున లాక్కొని విసిరేశాడు-వాడు ప్రాణ స్నేహితుడయినా, తనే పిలచి వాడికి కొయలిచ్చినా!

'మా అమ్మను చూడు మీ అమ్మేలా చంపేస్తోందో' అన్నాడు ఏడుస్తూ రాము.

పిచ్చయ్య స్నేహితునికి సమాధాన మివ్వ లేకపోయాడు. తల్లి దగ్గరకి గబగబా వెళ్లి. ఆమె చేతులు పట్టుకొని ఇంట్లోకి లాక్కు పోబోతున్నాడు. చేతుల్లో యింకా రాము తల్లి జుత్తుంది.

'నువ్వు లేరా పిచ్చి. దీన్ని చంపి మరీ వొదులుతాను. నా దొడ్లో... కొడుకు... కాజేసిందిగాకుండా, నా చేతులు ముక్కల వాలట!' అని రొప్పుకొంటూ, తిట్టుకొంటూ ఆమెను నేలమీద ఈడ్చేస్తోంది.

తల్లి అవస్థని చూడలేక రాము మళ్ళా గంగమ్మదగ్గరికొచ్చి గుద్దుతున్నాడు.

గంగమ్మ రాముని డొక్కలో ఒక్క తన్ను తన్నింది. రాము దూరంగా గోడకి గుద్దుకొని పడిపోయాడు.

పిచ్చయ్య తల్లి నొదిలి స్నేహితునిదగ్గరకి పరుగెత్తాడు. రాము పెదాలు ఎండిపోయాయి. మాట రావడంలేదు. బొంగురు పోయిన గొంతుకతో ఏడుస్తూనే, 'మా అమ్మను మీ అమ్మ చంపేస్తోంది' అంటున్నాడు.

పిచ్చయ్య రాము తల చూశాడు. తల నించి రక్తం కారిపోతోంది. రక్తాన్ని చూడగానే పిచ్చయ్యకళ్లు తిరిగిపోయాయి గబుక్కున లేచి తల్లి దగ్గరకి పరుగునవచ్చి 'అమ్మా... మ్మా... రాము తల బద్దలై పోయింది... రక్తం కారిపోతోందే' అని కంగారుగా ఏడుస్తూ అన్నాడు.

ఆ మాట గంగమ్మకి వినిపించి, కిందపడి వున్న రాముకేసి చూసింది. రాము తల నించి నిజంగానే రక్తం కారుతోంది. ఆ రక్తాన్ని చూడగానే ఆ గయ్యాళిచేతులు పట్లుతప్పాయి.

పిచ్చయ్య కేక రాముతల్లికిగూడ వినిపించింది. ఆమెగూడ తిరిగి చూసింది. కొడుకు తలనించి రక్తాన్ని చూడగానే ఆమె కంగారుగా మహాసాగర కెరటంలా లేచి ఒక్క గంతులో కొడుకుని కౌగిలించుకొని, పగిలినతలని చూసి పిచ్చికేక వేసింది.

దొడ్లో జనం అప్పటికే చాలమంది గుమిగూడిపోయారు.

స్నేహితుడు చచ్చిపోయాడేమో అనుకొన్నాడు పిచ్చయ్య. తల్లిని విడిపించుకొని రాముదగ్గరకి వెళ్లిపోవాలనుకొన్నాడు. కానీ గంగమ్మ చేతుల్లో బంధింపబడ్డ పిచ్చయ్యకి ఏం వీలు చిక్కలేదు.

'అమ్మా... మ్మా, రాము చచ్చిపోయాడేమోచూస్తానే.... అమ్మా... రాము... చచ్చి...' చటున నోరుమూసి పిచ్చయ్యను ఇంట్లోకితోసి గొళ్లెంపెట్టి అరుగుమీద కూచుంది.

ఒకటి చలించని రాతిగుండె. మరొకటి విలపిస్తున్న వెన్నగుండె. ఇద్దరూ స్త్రీలే. ఇద్దరూ తల్లులే. ఇద్దరిలోను వాత్సల్యం, మమత వున్నాయ్. ఇద్దరికీ తమ పిల్లలంటె ప్రేమే. ఇద్దరూ తమ పిల్లలు ఏడిస్తే బాధ పడతారు. గంతులేస్తే ఆనందిస్తారు. కాని ఆ హృదయాలే ఇతరులపట్ల శిలలుగా ఎందు కుంటవో!

తర్వాత దెబ్బలాట ముదిరి గంగమ్మ పక్షంవాళ్లు గంగమ్మ తరఫున, ఆమె పక్షం వాళ్లు ఆమె తరఫున దెబ్బలాడుకొని చివరకి మగాళ్లు కర్రలు, కత్తులు పట్టుకొనేంత వరకూ వచ్చింది.

గంగమ్మ భర్త వెంకన్న, బలవంతుడు, ధైర్యశాలి అయినా చాల శాంతస్వభావుడు. న్యాయబుద్ధి కలవాడు. అందువల్ల విషయాన్నంతనీ విని తన భార్యదే తప్పని ఒప్పుకొన్నాడు. కాని తర్వాత గంగమ్మ అతన్ని నానా మాటలు ఆడింది.

ఈ దెబ్బలాటవల్ల మించుకపోయిందేదీ లేదు. లోకంలో చచ్చినా బతికినా

(21-వ పేజీ చూడండి)



1 తులము టిన్నులలో అన్ని చోట్ల దొరకును.
శ్రీ అంబాళ్ అండు కంపెనీ,
తపాలు పెట్టె నెం. 8. మదరాసు.

# శిలాద్రవం

(14-వ పేజీ తరువాయి)

'గంగమ్మ మా తల్లి గయ్యాళిగంప' అనే మంచి పేరు తరాలుతరబడి నిలబడిపోతుంది. లోకాన్ని తృణీకరించి తిరిగేవారికి ఆచెడు మంచిలతో లెఖ్ఖ వున్నా లేకపోయినా, గంగమ్మమాత్రం ఎవ్వరినీ లెఖ్ఖచెయ్యలేదు — ఆమె మూర్ఖత్వంలో.

ఇప్పుడు పిల్లడికి బయట తిరిగే హక్కు లేదు. ఇంట్లోనే కావలిసినది తింటూ, ఆడుకొంటూ వుండాలి. బయటికి ఎప్పుడైనా తొంగిచూసినా స్నేహితులందరూ నిరాకరించేవారు — ఏ తుగ్రాడితో మాటాడినా రాముకి పట్టినగతే తమకీ పడుతుందేమోనని తప్పించుక తిరిగేవారు.

దెబ్బలాట జరిగిందగ్గర్నుంచి రాము యిటు రావడమే మానేశాడు. దొడ్లోగూడ వాడి మాటలు వినిపించడం లేదు. తల దెబ్బ పూర్తిగా మానిపోయివుంటుంది. వాణ్ణోసారి మాడ్డానికైనా వీలు చిక్కటం లేదు. తల్లి నెలా మోసపుచ్చాలా అనే ఎప్పుడూ ఎత్తులు వేసుకొనేవాడు, ఒకరోజా వీలుచిక్కింది.

పిచ్చయ్య గబగబా రాము యింట్లోకి వెళ్లాడు. రాము మరిద్దరు పిల్లలు దొడ్లో మట్టితో లక్కపిడతలు, బొమ్మలు, రైలింజన్లు చేసుకొంటున్నారు. స్నేహితుల్ని చూడగానే పిచ్చయ్య పొంగిపోయి 'రామూ' అని పిలచాడు.

పిల్లలందరూ వెనక్కి చూశారు. రాము నిలబడి పిచ్చయ్యను రమ్మన్నాడు. రమ్మనడం తడవుగానే పిచ్చయ్య పరుగెత్తి వాళ్ళలో కలిసిపోయాడు. రాము, పిచ్చయ్యకి తాను చేసిన బొమ్మలన్నీ చూపిస్తున్నాడు. పిచ్చయ్య అది చూస్తూ వాళ్ళల్లో ఒక్కడైపోయాడు.

'మా యింటికి రావడం లేదేం రామూ?' అని అమాయకంగా ప్రశ్నించాడు పిచ్చయ్య.

'మా అమ్మొద్దంది. నేను వస్తే మీ అమ్మ ఆ వేళలాగు కొడుతుంది.'

'అవును అమ్మ కొడుతుంది' అనుకొన్నాడు పిచ్చయ్య. మరి తన నెందుకు కొట్టదో?

ఇంతలో రాముతల్లి బయటినించి వచ్చింది. ఆమె పిల్లల్ని చూసినా ఏదో పని మీద వాళ్లని పలకరించకుండా అలా వెళ్లిపోయింది.

రాము గబగబా తల్లిదగ్గరకు వెళ్లి 'అమ్మా, పిచ్చి వచ్చాడే' అన్నాడు ఆనందంగా, నవ్వుకొంటూ.

ఆమె అప్పుడు వెనక్కి తిరిగి పిచ్చయ్యకేసి చూసింది. చూసి చిన్నపిల్లల మనసు లెంత నిర్మలమైనవో అని చిరునవ్వు నవ్వుకొంది. కాని గంగమ్మ ముఖం జ్ఞాపకం రాగానే ఆమెలోని చిరునవ్వలానే పెదాల్లో మాయమైపోయింది. పిచ్చయ్య దగ్గరికి వచ్చింది.

'ఎందు కొచ్చావ్ బాబూ, మళ్ళా రాము తల మీ యమ్మచేత పగలగొట్టించడానికా?' అంది.

పిచ్చయ్య సిగ్గుతో తలవొంచుకున్నాడు. రాముతల్లి ఈ మాట అనగానే ఆవాళ దొడ్లో రాము తల పగిలిపోవడం, రక్తం కారుతుండడం జ్ఞాపానికి వచ్చినై. రాము, తన యింట్లోకి వస్తేనే ఆవాళ అంత గల్లంతు చేసింది తల్లి; కానీ ఈవాళ తను రాము యింటికి వస్తే రాముతల్లి ఎందుకు కొట్టలేదు. అసలు ఏమీ అనదు అనే నమ్మిక పిచ్చయ్యకుంది; కాని ఆ నమ్మి కేమిటో పిచ్చయ్యకే తెలీదు.

తల్లి యిలా అనడంతో రాము అదోలా అయిపోయాడు. తల్లి చెయ్యి పట్టుకుని 'పిచ్చి చాల మంచాడమ్మ' అన్నాడు.

'అవును మంచాడే, మరి వాళ్ళమ్మ?' అని పిచ్చయ్యకేసి తిరిగి 'మీ యింటికి నువ్వు వెళ్ళిపో. లేనిపోని గొడవలన్నీ ఎందుకు మళ్లా? రావడం నువ్వే వచ్చావ్, తిరిగి మీ యమ్మతో చెప్పి మామీదికి ఉసి కలుపుతా' వంది.

'నేను...చెప్పను...' అని మెల్లగా గొణుక్కున్నాడు పిచ్చయ్య.

'నువ్వు చెప్పావొద్దు చెయ్యావొద్దు. తిన్నగా మీ యింటి కెళ్లిపో...ఆవాళ యింటి కొచ్చి ఆడుకొంటున్నవాణ్ణి తీసుకెళ్లి, జాంకాయలు కోయించావు. మళ్లా తల్లి రాగానే ఏం ఎరగనట్టు తప్పుకొన్నావ్...”

'పిచ్చి ఏం చెయ్యలేదమ్మ... వాడు చెబుతున్నా సరే గంగమ్మ వినిపించుకోలేదు.' అని పిచ్చయ్యతరపున క్షమార్పణ వేడుకొన్నాడు రాము.

'నా కవన్నీ అనవసరం. అత నింటికి అతన్ని పోనియ్. మీ యిల్లుండగా మా యిళ్లెందుకు రావడం?' అంటూ ఆమె వెళ్లిపోయింది.

పరాభవంతో పిచ్చయ్య పూర్తిగా చచ్చిపోయాడు. తలొంచుకొని అలానే నిలబడి వున్నాడు. రాము మెల్లగా పిచ్చయ్య పక్కకి వచ్చాడు. 'అమ్మ నిన్ను నిజంగా పొమ్మంటం లేదు. ఊరికే అంటోంది' అన్నాడు.

పిచ్చయ్య పిచ్చిగా రాముకేసి చూశాడు. రాము నవ్వాడు, ఆ నవ్వుని చూడగానే పిచ్చయ్య అన్నీ మరచిపోయి మళ్లా వాళ్ల ఆటల్లో కలిసిపోయాడు.

కొంతసేపయింతర్వాత పిచ్చయ్య యింటికి వెళ్లిపోయాడు.

ఇంటికి వెళ్లగానే గుమ్మంలోనే ఎదురయింది తల్లి. తల్లిని చూడగానే పిచ్చయ్య గుండెల్లో రాయి పడ్డట్టయింది. ఆమె వేయబోయే ప్రశ్నలకి ముందునించే సమాధానాన్ని వెతుక్కొంటున్నాడు.

తల్లి నిలబడగానే, వొణికిపోయి, ఆమె ప్రశ్నించకుండానే 'ఊహుఁ, లేదమ్మ గా- కాదమ్మ...ఆడుకోడానికి ... ఆడుకోడానికి...ఊహుఁ...ఆడుకొంటున్నానమ్మ.. అఁ అఁ; అన్నాడు.

'ఊరుకో దబాయించకు. ను వ్వెక్కడికి వెళ్లింది నే చూశాను...ఆ ముండలింటి కెళ్లొద్దని నీ కెన్నిసార్లు చెప్పాలి? ...ఆ ముండలికి సిగ్గుంటె సరి నా పిల్లాడిని పిలవరు.' అని కింద నున్న పిచ్చయ్యని ఇంట్లోకి తోసేసింది.

పిచ్చయ్యకి యిక్కణ్నుంచి ఆ నాలుగు గోడలమధ్యే జీవితం. ఆనందంగా, హాయిగా స్వేచ్ఛగా తిరగడానికి యింత పెద్ద భూమి వుండికూడ పిచ్చయ్య ఆ వంద చదరపు టడుగుల చరలలోనే జీవించాలి. ఇంత ప్రవహించే గాలి వున్నా, పిచ్చయ్య మాత్రం దయాదాక్షిణ్యాలతో ఆ చిన్న కిటికీలోంచి మారే పిల్లగాలుల బుజ్జగింపులోనే నిద్రపోవాలి.

తన వయసున వుండే చిన్నపిల్లలంతా

## రు. 100 బహుమానం

(గవర్నమెంటు రిజిస్టర్డు)

తెల్లవెంట్రుకలను అంత మొందించండి రంగులు వాడకండి మా ఆయుర్వేద సువాసన "సెంట్రల్ మోహిని ఆయిల్" 60 ఏళ్లదాకా నల్లగా ఉంచును. ఇది మీ దృష్టిని వృద్ధిపరచి తల నొప్పిని కుదుర్చుతుంది. కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ. 2-8-0 తో ఒక సీసా (మూడు ఒకసాగి 6-8-0) కొనండి. హెచ్చుగ తెల్లబడితే 8-8-0 (మూడు ఒకసారి 9-0-0.) తలంతా తెల్లబడితే రు. 5-0-0 (మూడు ఒకసారి రు. 12) కొనండి. ఇది అబద్ధమని ఋజావుచేసిన వారికి రు. 100 బహుమానం. పూర్ణ విశ్వాసానికి అణ్ణార స్టాంపు పంపి గ్యారంటీ తీసుకొనండి.

**Bharat Kalyan Aushadhalaya.**

Post Bag No 6725, Calcutta. (A P)

కేరింతాలు కొడుతూ ఉప్పట్లే, దొంగాటలు, కోతికొమ్మచ్చి ఆడుకొంటుంటే పిచ్చయ్యమాత్రం పంజరంలో పిట్టలా కొట్టుక చావవలసిందే.

బెంచిమీద సంచి ఎంచి, కంచినించి పొంచి చూస్తూ, పంతులంచ నాకే అందకండా తంటాలెడుతూ తిరిగే అదృష్టం పిచ్చయ్యకి లేదు.

ఇంటికి వచ్చే పంతులు ముందు ఏడుపు ముఖంతో కూచోవడం; మనసు పుస్తకాల మీద లేక చెప్పింది తలకెక్కకపోవడం; పంతులు వెళ్ళిపోయిన తర్వాతగూడ, తల్లి ఆజ్ఞప్రకారం ఆ చీకటికొట్లోనే పడి చదవడం; మధ్యాహ్నం అన్నం తిని ఏమీ తోచక, ఈ నరకాన్నెందుకు సృష్టించారనుకొంటూ నిద్రపోవడం; సాయంకాలం లేచి ఆ దొడ్లోనే ప్రాణంలేని జాంచెట్టుతో చుట్టూరా కట్టివున్న ముళ్లకంచెతో ఆటలాడుకోవడం; మళ్లా రాత్రికి దీపంముందు కూచొని రక్కసితల్లి పక్కనించి బలవంతం పెడుతుంటుంటె - లోపల కోపం ఉడికిపోతున్నా - ఆ పెద్దదాని బలంముందు ఓడిపోయి భయంతో తలొంచుకొని, లోలోనే కుమిలి కుమిలి ఏడుస్తూ, పట్టిన గొంతుకతో, చదివింది తలకెక్కని చదువుతో తలవొంచుకొని, కళ్లనించి ముక్కునించి కారిపోతున్న నీటితో పిచ్చయ్య తీరనివ్యథని ఆ మూర్ఖురాలు గ్రహించలేకపోయేది.

'అమ్మా, రంగడాళ్లతో దొంగాటాడుకొంటానే బయట' అనేవాడు పిచ్చయ్య తల్లిని బతిమాలుతున్నట్టు.

'వొద్దు నాన్నా. వాళ్లు పోకిరీగుంటలు. వాళ్లతో కూడితే నువ్వూ చెడిపోతావు.' అని కొడుకుని బుజ్జగించేది.

ఆమె ఎంత గయ్యాళిదయినా తన కొడుకునిమాత్రం చేయెత్తి కొట్టదు. కొడుకంటె ఆమెకు అపారమైన ప్రేమ, దయ—కాని ఆమె అజ్ఞానంవల్ల ఆ ప్రేమ, ఆ దయ మరో విధాన చెడుఫలితాలకు దారితీస్తోంది.

గంగమ్మ కొడుక్కి మంచి గడ్డపెరుగు, రొట్టె, పాలు, బలమైన తిండి యిస్తున్నా సరె పిచ్చయ్య క్రమంగా నీరసించిపోతున్నాడు. వీడెంత తింటున్నా సరె ఈసురోమంటూ దిగులుగా ఉంటాడు. తల్లిని చూస్తే జాలిగా చూస్తాడు, కాని ఆమెను తిరస్కరించలేడు.

ఆ ఒక్కగదిలోనే తిరుగుతూ బయటవాళ్ల ముఖాలే కరువైనందున, కొత్తవాళ్లని చూస్తుంటుంటె చాలు అదోరకమైన సిగ్గు, భయం, సంతోషాలతో ఒకపక్కకి తప్పుకొనేవాడు. ఇంటికి వచ్చే చుట్టాలలో తన ఈడుపిల్లలెవరైనా వుంటె వాళ్లనించి సిగ్గుతో తప్పించుకు తిరిగేవాడు. వాళ్ళు పలకరించినా, వాళ్ళకేసి చూసేందుకే ధైర్యం చాలేది కాదు. చివరికి తల్లి ఎదరగూడ సిగ్గుపడుతున్నాడు.

ఆ తొమ్మిదేళ్ల వయసులో లేడిలా గెంతుతూ, కిలకిల నవ్వులతో, ఎదుటివారి యిష్టాయిష్టాలని లెఖ్ఖచేయకండా తనయిష్టం వచ్చినట్టు మాటాడవలసే పిల్లాడు, దిగులుగా, భయంగా, సిగ్గుగా, ఉత్సాహం అనేదే కనబరచకండా ఏడుపుముఖంతో, మూగవాడిలా వుండడమేమిటో అది గంగమ్మకని పెట్టలేకపోయింది.

'ఇంకా పెరుగు కావాలా నాన్నా?' అని గంగమ్మంటె, పిచ్చయ్య తల అడ్డంగా తిప్పేవాడు.

'నా నాన్న, నా బంగారం, నా కొడుకు ఎంత మెత్తనోడు. పెద్దవాడయితే చాలసత్తిగాలం వాడవుతాడు; అని వాణ్ణి ముద్దులాడేది-కాని వాడికళ్లల్లో తిరిగేవి విషాదాశ్రువులా, ఆనందాశ్రువులా ఆమెకు అవసరంలేదు.

గుడ్డులోపల కమిలిపోయినా పైకి పెంకు మామూలుగానే వుంటుంది. అదే గంగమ్మకి కావలసింది. పైకి కొడుకు మెత్తగా, మౌనంగా వుంటున్నాడు. పెంకితనమంటేనే తెలీదు. తను ఏదడిగినా మెల్లగా జవాబు చెబుతాడు. రావన్న కొడుకులా దొరికిందే సందుగా నానాగడ్డీ బుక్కయ్యడు. మెల్లగా ఏదయినా ఆలోచించి మరి చేస్తాడు; అని లోలోన సంతోషించేది.

కొడుకుసంగతి భర్తతో చెప్పేది పొగుడుకొంటూ తను గొప్పవాడవబోయేవాడి తల్లిననే గర్వంతో.

'వాణ్ణింకెన్నాళ్లు యింట్లో చదివిస్తావ్, ఏదో బళ్లో వేసెయ్యగూడదు?' అనేవాడు వెంకన్న.

'బళ్లోనే. అమ్మబాబో. ఆ పెంకిగుంటలతో కూడి నా బాబు చెడిపోడూ! వాణ్ణి పట్నం పంపించి పెద్దచదులు చదివించి, నా బాబుని పెద్దవాణ్ణి చేస్తా' ననేది.

తల్లినిర్బంధంలో, పిచ్చయ్య ఆ నాలుగు గోడలమధ్యలోనే నీరసించి, జ్వరం తెప్పించుకొన్నాడు. గంగమ్మకి మతిపోయింది. ఇంతకముందు ఐదుగురు పిల్లలుగూడ ఐదునించి తొమ్మిదేళ్లలోపలే పోయేవారు. నమ్మకంగూడ కుదిరింది ఆవాళ చీపురుతో అమ్మవారిని బాదిందగ్గర్నుంచీ.

పిచ్చయ్య నీరసించిన దేహం మంచం పట్టిన మూడురోజుల్లోనే ఎముకలగూడయిపోయింది. గంగమ్మ కొడుకుపక్కన కూచొని ఏడుస్తుంది. వాడి గుండెల్లో తల దూర్చి కుమిలిపోతుంది. వాడు నిలువుమూపు చూస్తే పిచ్చెత్తినట్టు అరచేది.

ఎంతోమంది వైద్యులొచ్చారు; డబ్బు కాసపడి సేవచేశారు. మందులిచ్చారు; కషాయాలిచ్చారు. పెదాలు విరచారు.

'ఏం జబ్బు ముంగాకొడుక్కి'

'ఏదో లెస్తూ. గయ్యాళిముండకి తగిన శాస్తి. లేకపోతే ఇన్నా మన్నా కొనకండా ఒక్కలాగే మిడిసిపడుతుంది, ఆపరాత్పరుడు లేడూ?' అనేవారు గ్రామయిల్లాళ్లు.

ఉపవాసాలతో గంగమ్మగూడ నీరసించిపోయింది. కళ్లు మంటలెత్తుతున్నా మాతృమమతలోని క్షీరధారలు చల్లబరుస్తూనే వున్నై. ఎప్పుడూ పిచ్చయ్య పక్కన కూచొని ఆ చలనంలేని ముఖాన్ని తడుముతూ 'నాన్నా, నేను, అమ్మని, చూడు, నాకోసం కళ్లుతెరు.' అని ఏడుస్తుంది.

ఆ తొమ్మిదేళ్ల శరీరం, ఆ తొమ్మిదేళ్ళ మాంసం, ఆ తొమ్మిదేళ్ల ఎముకలు, సర్వం ఆమెగర్భంలో పెరిగాయి, తొమ్మిదినెలలు వదిలాయి. ఇప్పుడవి ఎక్కడికో ఎందుకో పోతున్నవి శాశ్వతంగా. ఎందుకు చచ్చిపోవాలి? తనభాగం, తన రక్తం, తన హక్కు, తనవల్లపుట్టి, తనవల్ల పెరిగిన, ఆస్తిని ఈనాళ తనకి కాకండా ఎవరు, ఎందుకు తీసుకపోతున్నారు?

నవ్వుతున్న నక్షత్రాల మధ్యకి నాల్గవరోజు పిచ్చయ్య నిశ్శబ్దంగా నడచిపోయాడు.

కొయ్యబారిపోయిన శరీరంమీద నిలువునా కూలిపోయింది గంగ. ఏడ్చింది - అది ఏడుపు కాదు, సృష్టివల్ల కలిగిన సహజ ఉచ్ఛరణ. ఆ ఏడుపు భాషలు నేర్చిన మానవుల్లోనూ, అరచే కుక్కల్లోనూ, ఓండ్రించే గాడిదల్లోనూ, ఘీంకరించే సింహాల్లోనూ, చలనంలేని చెట్లలోను, ఘుక్కుమనే ప్రకృతిలోనూ వుంది.

నిన్న మొన్నటివరకూ నవ్వే కొడుకుని ఈవాళ మన కాళ్లకింద నీచంగా చూడబడుతూ, మనం చేసే ప్రతీకార్యానికి తలొంచుకొంటూవున్న ఈ మురికిమన్ను కింద ఎందుకు పాతిపెట్టాలి? ఈ నేలకెంత అధికారముంది తన కొడుకు చిరునవ్వుల్ని కప్పివేయడానికి.

పిచ్చిగంగ కొడుకు చావుతో పిచ్చిదై పిల్లల్నందర్నీ 'పిచ్చీ' అని పిలుస్తూ అనందిస్తోంది. ★